✩ కథానిక

# చిన్నీ



—అకరంపేట ఇబ్రహీం

చిన్నీ మన్నేమైనా తింటున్నావేమే కడుపు చూడు ఎల్లా ఉబ్బిందో. రవికె హుక్కులు అందట్లేదు.

ఏవిటమ్మా అలా స్థబ్దుగా ఉన్నావ్. ఒంట్లో బాగోలేదా?

ఏం పిల్లో ఉలకదు పలకదు. పన్నెండేళ్ళు వచ్చాయ్. బట్టలు కూడా తొడుక్కోలేదు. చిన్నీ! ఎందుకమ్మా స్కూలంటే భయపడుతున్నావ్. ఇంతకుముందు బాగా వెళ్ళేదానివిగా! వెళ్ళమ్మా. మా మంచి చిన్నీ కదా...

చిన్నీ జాగ్రత్త! స్కూలవగానే ఇంటికిరా.

* * * * *

చిన్నా ఎందుకో డల్‌గా ఉంటోంది లక్ష్మీ.

నాక్కూడా అలాగే అన్పిస్తోందండీ. కడుపు కూడా ఉబ్బింది. పాములేమన్న చేరాయేమో!

ఏదీ ఎక్కడుంది. ఒకసారి పిలువ్. చిన్నా చిన్నా.

చిన్నా! ఎందుకమ్మా డల్‌గా ఉన్నావ్. స్మైల్ బేబీ. కమాన్ స్మైల్. నువ్విలాగే డల్‌గా ఉంటే డాక్టర్ దగ్గరికి తీసికెళ్తా. అతను సూది వేస్తాడు.

ఆ... ఏది. అలా... అలా నవ్వాలి. మా మంచి పాపకదూ! రా భోం చేద్దువుగానీ.

* * * * *

చిన్నా ప్రవర్తన వేరుగా ఉంటోంది లక్ష్మీ. చాలా ముభావంగా నీరసంగా ఏదో పోగొట్టుకొన్న దానిలా ఉంటోంది. ఎంత అల్లరి పిల్ల ఎంత డల్‌గా తయారైంది. నువ్వు గమనించావో లేదో నెల రోజుల నుంచి తనిలాగే ఉంటోంది.

మీరు మరీ బాధపడకండి. చిన్నపిల్ల కదా! ఏదో తినుంటుంది. కడుపులో పాములు చేరివట్టున్నాయ్. అందుకే మందకొడిగా ఉంటోంది.

మరీ మన్ను తినేంత చిన్న వయసు కాదుగా తనది. ఏం తింటున్నానవే స్పృహ ఉండకుండా ఉంటుందా?

ఇంకో రెండు రోజులు చూద్దాం. మార్పులేకుంటే మీరన్నట్టుగానే హైదరాబాద్ తీసికెళ్ళి సైకియాట్రిస్ట్‌కు చూపిద్దాం. ఇక పడుకోండి. బాగా రాతిరయింది.

మమ్మీ... మమ్మీ... కడుపులో నొప్పి. మమ్మీ... రక్తం. మమ్మీ... మమ్మీ...

చిన్నీ...! వస్తున్నానమ్మా. వస్తున్నా... చిన్నీ...! ఏవండి! చిన్నాకేదో అయిందండి. ఏవండి. రండి. చిన్నీ... అయ్యో రక్తం... బ్లీడింగ్ అవుతోందండి.

చిన్నా...! ఏమైందమ్మా. ఏమైంది లక్ష్మీ. ఏమైంది చిన్నాకి. చిన్నా... చిన్నా... మాట్లాడమ్మా.

పొద్దున్నే జానకి పిన్ని పాముల మందు ఇస్తే తాగించానండి. పాములు పోతే చిన్నీ బాగవుతుందనుకొన్నానండీ. ఇలా అవుతుందనుకోలేదు.

ఎంత పని చేశావ్ లక్ష్మీ. చిన్నా... చిన్నా... కళ్ళు తెరువమ్మా... ఇటుచూడు. లక్ష్మీ త్వరగా పద హాస్పిటల్‌కు తీసికెళ్దాం. చిన్నా... చిన్నా...

* * * * *

చూడు వంశీ పిల్లలు తెలిసి తెలియని వయసులో కాలుజారి ఏదో తప్పు చేస్తారు. మీరు పెద్దవాళ్ళు చదువుకున్న వాళ్ళు నాటుమందులు వాడి ఇలా అమ్మాయి ప్రాణాల మీదికి తేవటం...

... మీరేమి మాట్లాడుతున్నారో నాకు అర్థం కావటం లేదు డాక్టర్.

మీ అమ్మాయి గర్భవతి. అబార్షన్ అవటం కోసం ఏదో మందు ఇచ్చారు. డాక్టర్ మీరు స్పృహలో ఉండే మాట్లాడుతున్నారా... మీకు పిచ్చిగాని

పట్టలేదు కదా!

కూల్‌డౌన్ మైబోయ్. నేను నిజమే చెబుతున్నా...

మా చిన్నీ పసిపిల్ల. అభం శుభం తెలియనిది. ఇంకా మెచ్యూర్ అవలేదు కూడా. అలాటి దాన్ని గర్భవతి అంటారా..?

**ఇట్స్ ఓకే వంశీ. మీ అమ్మాయి పసిపిల్లే. ఇటీజ్** హర్ మిస్‌ఫార్చ్యూన్. మెచ్యూర్ అవటానికి ముందు ఆమెకు శారీరక సంపర్కం కలిగి ఉండొచ్చు. దాంతో మెచ్యూరిటీకి సంకేతంగా రావాల్సిన మెన్సెస్ ప్రెగ్నేన్సీ కారణంగా ఆగిపోయుండవచ్చు.

స్టాపిట్ డాక్టర్. నేను నమ్మలేక పోతున్నా. అమ్మాయి మందకొడిగా ఉంటే కడుపులో పాములు చేరాయేమోనని మందిస్తే బ్లీడింగ్ అటుంది. మీరు దాన్ని అబార్షన్ అంటున్నారు.

అయామ్ సారీ వంశీ. మీ అమ్మాయి గర్భం దాల్చిందన్న విషయాన్ని మీరు జీర్ణించుకోలేకపోతున్నారు. ఏమైనా అమ్మాయి తెలిసి ఈ తప్పు చేసి ఉండకపోవచ్చు. ఎందుకంటే ఇంత చిన్నవయసులో ఆమెకలాంటి ఆలోచనలు రాకపోవచ్చు. ఎవరైనా అత్యాచారం చేశారేమో! సిటీలో మంచి హాస్పిటల్లో చూపించి అత్యాచారం జరిగింది లేనిదీ కన్‌ఫమ్ చేసికోండి. బట్ ఒన్ థింగ్ ఈ విషయం గురించి అమ్మాయిని అడగకండి. ఆమె విపరీతమైన మానసిక ఆందోళనకూ, భయానికి గుర్తయింది. మీరు ఆమెతో జాగ్రత్తగా ప్రవర్తించాలి.

* * * * *

హాస్పిటల్ నుంచి వచ్చాక చిన్నీ గుక్కెడు మంచి నీళ్ళు కూడా తాగలేదండి. మేలు కొన్నప్పుడు ఎటో చూస్తుంటుంది. నిద్దట్లో ఏమిటేమిటో కలవరిస్తుంది. ఒళ్ళు కాలిపోతోంది జ్వరం కొంచెమైనా తగ్గలేదు....

... భయంతో ఒకటే వణికిపోతోంది. మాట్లాడరేమిటండీ. చిన్నీ పరిస్థితి.... ఏం మాట్లాడను లక్ష్మీ. పాలుగారే పసి మొగ్గను కామంతో నలిపేసిన దుర్మార్గుడు....

అయ్యో మీరలా మాట్లాడకండి. చిన్నీ వినిందంటే ఆ పసి మనసు ఇంకా గాయపడుతుంది. ఏవండీ మళ్ళీ ఏదో కలవరిస్తోంది చూడండి.

మమ్మీ... మమ్మీ... ప్లీజ్. వద్దు మాస్టారూ... ప్లీజ్ వదలండి. అబ్బా... నెప్పి. మమ్మీ... హెల్ప్‌మి. ప్లీజ్ మాస్టారూ... వద్దు... నెప్పి... ప్లీజ్... మమ్మీ... మమ్మీ...

చిన్నీ... చిన్నీ... కళ్ళు తెరవమ్మా ఏమైంది. మాస్టారేం చేశారు. చిన్నీ... చిన్నీ... ఏవండి... ఎక్కడికండి వెళుతున్నారు. చిన్నీ చూడండి... ఏవండి... ఎక్కడికంత విసురుగా... ఏవండీ...

* * * * *

..... గొడ్డును బాదినట్లు బాదుతున్నారు?

ఎందుకా? నీ అన్నకు కామంతో కళ్ళు మూసుకుపోయి పసిదాన్ని చెరిచాడు. థూ... నీయమ్మ. ఇంకోసారి ఇలాంటి పని చేస్తే ప్రాణం తీస్తా నాకొడకా. నీ కామానికి నా కూతుర్ని బలి చేశావు కదరా...

ఒ...రే...య్... శీ...నూ... నీ..ళ్ళు... దా...హం...

నీకు నీళ్ళిచ్చి పాపం కట్టుకోలేనురా దుర్మార్గుడా. ఎంత నీచానికి ఒడిగట్టావురా. గురు బ్రహ్మ అన్నారు కదరా అందుకేనా పసిదాని కడుపులో ప్రతిసృష్టికి పూనుకొన్నావు. మానవత్వాన్ని, మంచితనాన్ని పిల్లలలో పెంపొందించాల్సిన వాడివి మనిషివన్న సంగతి మరిచావు కదరా.

నవసమాజ రూపశిల్పి, భావితరాలకు మార్గదర్శి. వ్యవస్థకు మూలస్థంభం అని కీర్తించారు గదరా గురువుని. అలాంటి ఉన్నతమైన వ్యక్తిని అత్యంత నీచస్థితికి దిగజార్చావు కదరా.

ఒరే..య్.. శీ...నూ... నీళ్ళు... నా...కాళ్ళు... కదల...టం..లే...దురా...

నీ నోరు పడిపోవాల్సింది. ఆదర్శాలు వల్లించి నీ నాలుక మొద్దుబారింది కానీ, నీ ఒళ్ళు కామంతో తిమ్మిరెక్కింది. గురుర్విష్ణు గురుదేవో మహేశ్వరహ గురుసాక్షాత్... అని నీ లాటి గురువుల్ని దేవతల పక్కన చేర్చినందుకు ఆ దేవతలు సిగ్గుపడాల్సిన అవసరం కల్పించావు గదరా. నువ్వు నీతిమాలిన నా కొడుకువని తెలుసుగానీ, ఇంత నీచానికి ఒడిగడ్తావనుకోలేదురా. థూ... వెధవ నాకొడకా నీ తమ్ముడినై పుట్టినందుకు సిగ్గుపడుతున్నా.

శీనూ... నా కాలు... నిజంగా... నడుము నుంచి... నా స్వాధీనంలో... లేదురా...

ఇంకేం. శుభం. వెన్నెముక విరిగినట్లుంది. నీవిక పసిపిల్లల్ని చెరచలేవు. నీకు తగిన శాస్తి జరిగింది. ఇక జీవితాంతం కుళ్ళి కుళ్ళి చావ్.. నా కొడకా....

## స్వాతంత్ర్య ఉద్యమంలో దివ్యజ్ఞాన సమాజం

సమాజ సేవలోనేగాక దివ్యజ్ఞాన సమాజం స్వాతంత్ర్యోద్యమంలో కూడా అలనాడు పాల్గొంది. అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్న ఈ దివ్యజ్ఞానసమాజం మొట్టమొదటిసారిగా న్యూయార్కు నగరంలో నవంబరు 17, 1875వ సంవత్సరమున స్థాపించబడింది. అటుతరువాత 1905వ సంవత్సరం ఏప్రిల్ 3వ తేదీ మద్రాస్ అడయార్‌కు అంతర్జాతీయ దివ్యజ్ఞానసమాజ కార్యాలయం తరలించబడింది.

మేడం బ్లవట్‌స్కీ, కర్నల్ హెచ్.ఎస్. ఆల్కాట్‌లు దివ్యజ్ఞాన సమాజ స్థాపకులు. సమసమాజ సిద్ధాంతాలకోసం, సర్వమానవ సమైక్యతకోసం పాటుపడే దివ్యజ్ఞాన సమాజాన్ని ఆంగ్లంలో "థియోసాఫికల్ సొసైటీ" అని పిలుస్తారు. దేశవిదేశాలలో సైతం దివ్యజ్ఞానసమాజ శాఖలున్నాయి.

సమాజ ఆశయాలు మూడు వున్నాయి. వాటిలో ఒకటి జాతి, మత, లింగ, వర్ణ వివక్షత లేని విశ్వమానవ సౌభ్రాతృత్వ అణుకేంద్ర నిర్మాణం. రెండవది సర్వమత సామరస్యం, తత్త్వం విజ్ఞాన శాస్త్రముల పఠన ప్రోత్సాహం. మూడవది ప్రకృతి ధర్మముల పరిశీలన, మానవ అతీంద్రియశక్తుల పరిశోధన మొదలైనవి వున్నాయి. దివ్యజ్ఞాన సమాజం కేవలం తన సిద్ధాంతాలకోసమే గాక స్వాతంత్ర్యోద్యమంలో కూడా పాల్గొన్నట్టు తెలుస్తోంది.

విదేశీవనిత అయిననూ భారతదేశంపై మక్కువతో స్థిరపడిన ఆదర్శవనిత డా. అనీబిసెంట్. ఆమె అప్పట్లో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని బ్రిటీష్‌వారిని ఎదుర్కొనగలిగింది.

భారతదేశ సంస్కృతి, ఆచార వ్యవహారములు ఆమెకు నచ్చాయట. స్వాతంత్ర్యం రాకముందు ఆంగ్లేయుల పరాయిపాలన అనిబీసెంటుకు నచ్చలేదు.

ఆంగ్లేయుల పాలన తుదముట్టించాలని అనిబీసెంట్ పిలుపునిచ్చారు. 1916వ సంవత్సరంలో ఆమె హోమ్‌రూల్ ఉద్యమంలో తోటి మహిళలతో కలిసి ఉద్యమించారు. 1917వ సంవత్సరంలో అనిబీసెంట్ కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించారు. అప్పట్లోనే ఆమె దివ్యజ్ఞాన సమాజ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.

బాపూజీ సైతం అనిబీసెంట్ కృషిని అభినందించారట. స్వాతంత్ర్యసమరంలో పాలుపంచుకున్న దివ్యజ్ఞాన సమాజం విశ్వశాంతికి కూడా కృషి చేస్తోంది.

ఈ సమాజ సభ్యులు ప్రతిరోజూ ప్రతిచోట ప్రపంచశాంతికోసం 'భారత్ సమాజ్' పూజలు నిర్వహించడం విశేషం. ప్రస్తుతం దివ్యజ్ఞాన సమాజ అంతర్జాతీయ కేంద్రం అధ్యక్షురాలిగా శ్రీమతి రాధాబర్నియర్ పదవి కొనసాగిస్తున్నారు.

— లక్కరాజు ప్రఫుల్లచంద్ర